తప్పిన ప్రమాదం..!

● టీఆర్టీలో కూలిన భారీ వృక్షం ● ధ్వంసమైన కారు, ఓ రేకుల ఇల్లు, అపార్ట్‌మెంట్ ప్రహరీ
● తెగిపడిన విద్యుత్ తీగలు ● ఓ వృద్ధురాలికి స్వల్ప గాయాలు



విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది



కూలిన చెట్టు కింద నలిగిపోయిన కారు



చెట్టు కొమ్మలు పడటంతో ధ్వంసమైన ఇంటి పైకప్పును పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు



టీఆర్టీ కాలనీలో కూలిన చెట్టు కొమ్మల శిథిలాలను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

నల్లకుంట: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీకాలనీలోని భారీ వృక్షం నేలకూలింది. మోనికాలక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న నాలుగు దశాబ్దాల నాటి ఓ భారీ వృక్షం సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా నేలకూలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో ఆ వీధిలో జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా ఆ చెట్టు పక్కనే పార్క్ చేసిన ఓ కారు ధ్వంసమయ్యింది. విద్యుత్ తీగలు తెలిపడ్డాయి. అదే విధంగా చెట్టు కొమ్మలు అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న క్వార్టర్ నంబర్ 309/310 ఆవరణలో ఉన్న రేకుల గదిపై పడింది. దీంతో అపార్ట్‌మెంట్ ప్రహరీ కూడా పాక్షికంగా ధ్వంసం అయ్యింది.

గాయాలతో బయటపడ్డ వృద్ధురాలు..

◆ రేకుల గది పై కప్పు పూర్తిగా ధ్వంసమైంది. ఆ గదిలో గత పదేళ్లుగా వృద్ధురాలు కానోజ్ బాలమ్మ(70) అద్దెకు ఉంటోంది. చెట్టు కొమ్మలు ఇంటిపై కూలడంతో రేకుల శిథిలాలు పడి వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారమందుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ వై. అమృత, జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్16 డీసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలత, అంబర్‌పేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎ.భిక్షపతి, సంతోష్‌లు అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో వెంటనే డీఆర్ఎఫ్ బృందానికి సమాచారమందించి అక్కడికి రప్పించారు. కూలిన చెట్టు కొమ్మలు, శిథిలాలను యుద్ధప్రాతిపదికన అక్కడి నుంచి తొలగింపజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కార్పొరేటర్ అమృత

◆ గాయపడిన వృద్ధురాలికి వైద్య అందించి ఇంటి యజమానికి పరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ అమృత చెప్పారు. గత కొద్దిరోజులుగా నిత్యం రాత్రి వేళ భారీ వర్షాలు కురుస్తున్నందున ఇళ్ల నుంచి బయటకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే సమయంలో బలహీనంగా ఉండి కూలిపోయే స్థితిలో ఉన్న చెట్లను తొలగించాలని జీహెచ్‌ఎంసీ హార్టికల్ అధికారులను కోరారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపడతామని చెప్పారు.

బలహీనంగా ఉన్న చెట్లు, శిథిల భవనాలు తొలగిస్తాం: డీసీ మారుతీదివాకర్

◆ దశాబ్దాల క్రితం నిర్మించిన శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలను తొలగిస్తామని డీసీ మారుతీ దివాకర్ అన్నారు. అలాగే బలహీనంగా ఉన్న చెట్లను కూడా తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

రిపోర్ట్ కలెక్టర్‌కు అందజేస్తాం..

◆ చెట్టు కూలడంతో ధ్వసమైన ఇంటిని పరిశీలించామని ఆర్ఐలు భిక్షపతి, సంతోష్ తెలిపారు. ధ్వంసమైన ఇంటి, కారు వివరాలను రిపోర్ట్ సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. నష్టపరిహారం ఎంత ఇవ్వాలనేది కలెక్టర్ నిర్ణయిస్తారని తెలిపారు. క్లెయిమ్ చేసుకుంటే కారుకు సంబంధించి పరిహారం ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లిస్తుందని పేర్కొన్నారు.

వివేక్‌నగర్ కూలిన చెట్టు

చిక్కడపల్లి: వివేక్‌నగర్ దుర్గనల్లపోచమ్మ దేవాలయం వద్ద సోమవారం రాత్రి భారీ వృక్షం విరిగిపడింది. ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌పై కొమ్మలు పడటంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో డీఆర్ఎఫ్, ఇందిరాపార్క్ విద్యుత్ సిబ్బంది వచ్చి వెంటనే చెట్ల కొమ్మలను తొలిగించారు. రెండున్నర గంటల పాటు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



విద్యుదాఘాత మృతులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కాచిగూడ: విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ నందకిషోర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చెప్పల్‌బజార్‌లో ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రామంతాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శోభాయాత్రలో విద్యుదాఘాతంతో 6 మంది మరణించారని తెలిపారు. ప్రభుత్వం, అధికారుల బాధ్యతరాహిత్యంతోనే వారు మృతి చెందారని ఆయన ఆరోపించారు. ఈ సంఘటనకు బాధ్యులైన అధికారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలన్నారు.

మహనీయుల త్యాగాలను మరవొద్దు

లిబర్టీ: మహనీయుల త్యాగాలను మరవొద్దని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పీవీ రాజేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు ఫణంగా పెట్టిన యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఎదురించిన యోధుడు సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను దేశం నుంచి తరిమికొట్టేందుకు సాగిన ఉద్యమంలో సుభాష్‌చంద్రబోస్ నిర్వహించిన భూమికను నేటికి ప్రజలు మర్చిపోలేరన్నారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత నడుం బిగించాలన్నారు.

వర్గీకరణ పేరుతో దళితుల్లో చిచ్చు

లిబర్టీ: వర్గీకరణ పేరుతో దళితుల్లో చిచ్చుపెట్టిన ఘనత చంద్రబాబు నాయుడికి దక్కుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రొఫెసర్ వీఎల్‌రాజు ఆరోపించారు. దళితులు ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తూ హక్కుల కోసం ఉద్యమిస్తున్న నేపథ్యంలో వర్గీకరణ పేరుతో మంటలు రేపి దళితుల్లో విభజన విధానానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధన కోసం వర్గీకరణ రద్దు కోసం తిరుగుబాటు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని 341ఆర్టికల్ ప్రకారం వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టుకు తీర్పుకు భిన్నంగా వర్గీకరణ ఎలా చేస్తారని సూటిగా ప్రశ్నించారు. దళితుల ఐక్యత కోసం కృషి చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చంద్రబాబునాయుడు విభజించే అంశంపైనే ఎక్కువ దృష్టి సారించి దళితుల్లో ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. రాజేంద్ర, సుబ్బారావు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



తాళ్లబస్తీలో కర్రపూజలో పాల్గొన్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: గణపతి మండప నిర్వాహకులు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని కార్పొరేటర్ జి.రచనశ్రీ కోరారు. సోమవారం తాళ్లబస్తీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్రపూజకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.వెంకటేష్, తాళ్లబస్తీ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్ గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శులు మల్లేష్, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మధుసూదనాచారికి 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ' అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక కళలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం రాత్రి శృతిలయ ఫౌండేషన్, సీల్వెల్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్సీ మధుసూదనాచారికి ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ ఆయనకు అవార్డును ప్రదానం చేసి మాట్లాడారు. దేశభక్తితో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్న వారిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కోలేటి దామోదర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మహ్మద్ రఫీ, వంశీరామరాజు, ఆనంద్, దైవజ్ఞశర్మ, కుసుమ భోగరాజు, నవరస గాయని ఆమని తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి



సెమినార్‌లో రాజేంద్రపాల్ గౌతమ్‌ను సన్మానిస్తున్న డా. సరోజవివేక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపైన ప్రతి విద్యార్థి అధ్యాయనం చేసి అవగాహన పెంచుకోవాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీటి షెడ్యూల్డ్ క్యాస్ట్ డిపార్ట్‌మెంట్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్ అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అటనామస్ కళాశాలలో 'షెడ్యూల్డ్ క్యాస్ట్ పథకాలు, వాటి ఉపయోగం'అనే అంశం పై సెమినార్ జరిగింది. రాజేంద్రపాల్ గౌతమ్ మాట్లాడుతూ.. ఎస్సీ వెల్ఫేర్‌లో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ కులాలతో పాటు బలహీనవర్గాల అభివృద్ధికి అంబేడ్కర్ చేసిన కృషి అంతాఇంత కాదన్నారు. దేశం మొత్తం తిరుగుతూ... అనగారిన వర్గాలు విద్యను అభ్యసించాలని అప్పుడే వారు అభివృద్ధి పథంలో పయనిస్తారని నమ్మిన వ్యక్తి అని కొనయాడారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత చదువులు చదవాలని సూచించారు. అనంతరం రాజేంద్రపాల్ గౌతమ్‌కు మెమోంటో బహూకరించి కళాశాల కరస్పాండెంట్ డా.సరోజవివేక్ సన్మానించారు.

శిల్పి వంగీపురం శరణ్‌కుమార్‌కు సత్కారం

చిక్కడపల్లి: తెలంగాణ స్త్రీ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలకలపై పురాణ చిత్రాలు చెక్కే శిల్పి వంగీపురం శరణ్‌కుమార్‌ను సత్కరించారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ప్రొ. జయరాములు ముఖ్యఅతిథిగా హాజరై అభినందించారు. హైమవతి భీమన్న అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు పొత్తూరి సుబ్బారావు, జగన్నాథరెడ్డి, భవాని, జయలక్ష్మి, విశాలక్ష్మి, లాస్యప్రీతి, గురజాడ శోభాపేరిందేవి, పద్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాలలో రాణించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముషీరాబాద్ గంగపుత్ర సంఘం నాయకులు

ముషీరాబాద్: చేపల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గంగపుత్రులు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ గంగపుత్ర సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గంగపుత్రులు రాజకీయంగా మరింత రాణిస్తే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. చేపలు విక్రయించే చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు రాంచందర్, హనుమంతు, పూస గోరఖ్‌నాథ్, కనుగుల రవి, ఆర్‌కె ప్రసాద్, నర్సింగ్‌రావు, శ్రీరాములు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదీన హైదరాబాద్, ఇందిరాపార్కు వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో చేపట్టనున్న బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా బీసీలను అణగదొక్కేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై వివిధ రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాలతో కూడిన అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రిజర్వేషన్లు అమలయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీని కలిసి రిజర్వేషన్లు అమలయ్యే విధంగా చూడాలన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రభాకర్

చిక్కడపల్లి: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ముచ్చకుర్తి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ... మున్నూరుకాపుల ఐక్యతకు సంఘం అభివృద్ధి కృషి చేస్తానన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీబీఎఫ్ కార్యదర్శి పి.శంకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భూమి లేని వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలని టీపీఎస్కే జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీబీఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం, టీవీవీయూ, పీఎంసీల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కూలీలందరికీ అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12వేలు అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 2025 జనవరి 10న పంచాయితీరాజ్ శాఖ , గ్రామీణ అభివృద్ధి శాఖ విడుదల చేసిన జీవో 42 ప్రకారం భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి సంవత్సరానికి 12వేల రూపాయలను రెండు విడతలుగా చెల్లిస్తామని ప్రకటించారని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వ హామీ ప్రకారం వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. లేకుంటే దశలవారీగా ఐక్య ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్ . శివలింగం నరిసింహ, రమేష్, కొండల్, కన్నెగంటి రవి, సంజీవ్, శోభన్ నాయక్, తుకారం, బి.ప్రసాద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే నులిపురుగుల నివారణ



ఆంధ్ర విద్యాలయంలో మాత్రలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: వ్యక్తిగత శుభ్రతతోనే నులిపురుగుల నివారణ సాధ్యమని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని ఆంధ్ర విద్యాలయం పాఠశాలలో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అన్నం తినేముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. శుభ్రమైన నీటినే తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.వినయ్‌కుమార్, శ్రీకాంత్, పి.నర్సింగ్‌రావు, శివకుమార్, సత్యేందర్, ఏఎస్‌ఎం భవాని, ఆశావర్కర్లు లక్ష్మి, సుచిత్ర, మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుజనుల ధిక్కార స్వరం పాపన్న

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు



పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాన్యుడి దిక్కారం సర్దార్ సర్వాయి పాపన్న అని పలువురి వక్తలు కొనియాడారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ,టీపీఎస్కే ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, టీపీఎస్కే కన్వీనర్ భూపతివేంకటేశ్వర్లు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబులు మాట్లాడుతూ... రాజ్యాధికారం గురించి సామాన్యుడు ఆలోచించడానికి సాహసించిన రోజుల్లో ఏకంగా గోల్కొండ రాజ్యాన్ని ఏలిన సామాన్య బహుజన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. పన్నులకు వ్యతిరేకంగా 12 మంది సైన్యంతో పోరాటాన్ని ప్రారంభించి 12 వేల సైనికశక్తిని పెంచిన పరిపాలనాదక్షుడని పేర్కొన్నారు. అంబాల నారాయణగౌడ్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కులో...

◆ వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో క్లబ్ అధ్యక్షుడు పీ.వి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, ఎస్.రమేష్‌రెడ్డి, డాక్టర్ సునీల్, కృష్ణ, జగన్ , సీతరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారానికి పోరాటం..

◆ **కవాడిగూడ:** బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గీత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడల శంకర్, కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు సానెం హరీష్‌గౌడ్‌లు సూచించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని సోమవారం కవాడిగూడ గౌడ సంఘం కార్యాలయంలో సంఘం నాయకులు మొరిగడి నవీన్‌గౌడ్, కృష్ణల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న రాజ్యాధికారం, హక్కుల సాధనకు పాటుపడ్డారన్నారు.

ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటుపై హర్షం..

◆ రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్డులో పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేయడం అభినందనీయమన్నారు. కవాడిగూడ గౌడ సంఘం సలహాదారులు గర్వందుల అంజయ్యగౌడ్, నాయకులు ప్రతాప్‌గౌడ్, మద్దెల చంద్రయ్యగౌడ్, ఎల్. సత్యానారాయణ, పబ్బతి ప్రవీణ్, అరుణ్‌గౌడ్, జహంగీర్, వెంకటేష్, ఉదయ్, రాజు, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ట్యాంక్ బండ్ పై ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఓబీసీ మోర్చా మహంకాళి జిల్లా అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధన పోరాట యోధుడు..

◆ **ముషీరాబాద్:** బహుజన రాజ్యాధికార సాధన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమాన్ని రాంనగర్‌లో గౌడ సంఘం సీనియర్ నాయకుడు ముత్యం బాలరాజుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ.. పేదల పెన్నిది, సమ సమాజ స్థాపనకు తన ప్రాణాలను అడ్డంపెట్టి పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. మొగలులను ఎదిరించిన తొలి తెలంగాణ వీరుడని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. గౌడ సంఘం నాయకులు భిక్షపతిగౌడ్, జంగయ్యగౌడ్, ప్రకాష్‌గౌడ్, శివగౌడ్, మహేందర్, శివానంద్, కృష్ణ, శ్రీను, రామకృష్ణ, ముత్యాలు, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న జీవితం స్ఫూర్తిదాయకం: బూర

◆ **కాచిగూడ:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజల కోసం, సమాజం కోసం పోరాడిన వారిని ఎప్పుడూ మర్చిపోవద్దన్నారు. 'నీ కొసం పనిచేస్తే నీలోనే ఉండిపోతావు, జనం కోసం పనిచేస్తే జనంలో ఉండిపోతావు'అని గొప్ప విషయాలు చెప్పిన మహనీయుడు పాపన్నగౌడ్ అని అన్నారు.

◆ ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ ప్రాంతంలోని ఖిలాషాపూర్‌లో జన్మించి పశువుల కాపరిగా ఉంటూనే రాజుల సైన్యాలు, వారి ఆగడాలను ఎదదురించారని గుర్తు చేశారు. ఉమ్మడి హక్కుల కోసం పోరాడి అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచిన ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, నాయకులు సుభాష్ పటేల్ గౌడ్, సంజయ్, శ్రీనివాస్, కిరణ్ గౌడ్, సి.వినోద్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, అజయ్ కుమార్, కేశబోయిన శ్రీధర్, శ్యామ్‌రాజ్, స్వరూప, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మడమ తిప్పని పోరాట యోధుడు పాపన్నగౌడ్

◆ **నల్లకుంట:** మడమ తిప్పని పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం గౌడ సంఘం నాయకులు టి.లాలయ్యగౌడ్, దూసరి వెంకట్‌గౌడ్, సతీష్ చంద్రగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన బీసీ జాగృతి అధ్యక్షుడు మురళీకృష్ణ, గౌడ సంఘం నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, బి.నాగేష్ గౌడ్‌లతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయం వద్ద సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీ. కిషోర్‌కుమార్, వెంకట్‌గౌడ్, పాతకోటి మహేష్, మధుగౌడ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.